AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
17-3-2026 (Tuesday)
MAIN EDITION

బ్యాంక్ మేనేజర్‌ను కాల్చేసిన గార్డ్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: సెలవులు, జీతానికి సంబంధించిన విషయాలతో మనస్తాపం చెందిన ఓ బ్యాంక్ సెక్యూరిటీ గార్డు.. బ్యాంకు మేనేజర్‌ను హత్య చేసిన ఘటన గాజియాబాద్‌లో చోటుచేసుకుంది. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో రవీంద్ర హుడా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి మేనేజర్ అభిషేక్ కుమార్ (34) క్యాబిన్‌లోకి వెళ్లిన రవీంద్ర అతడిపై తుపాకీతో కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను సిబ్బంది ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

హుక్కా సెంటర్‌పై దాడి.. 36 మంది అరెస్ట్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: హైదరాబాద్ నగరంలో పలువురు యువత వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగం భారీగా పెరిగింది. మరోవైపు హుక్కా సెంటర్లు సైతం చాలా చోట్ల నిర్వహిస్తున్నారు. తాజాగా ఎల్‌బీ నగర్ పరిధిలోని హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడులు చేశారు. ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు సోమవారం రాత్రి దాడులు చేశారు. హుక్కా తాగడానికి వచ్చిన 32 మంది కస్టమర్లు, సెంటర్‌లో పని చేస్తున్న నలుగురు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 38 ఫోన్లు, హుక్కా పాట్లు స్వాధీనం చేసుకున్నారు.

బెంగాల్‌లో 13 జిల్లాల ఎస్పీల మార్పు



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సంచలన నిర్ణయాలు తీసుకుంటుంది. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేస్తోంది. మంగళవారం ఏకకాలంలో 13 జిల్లాల ఎస్పీలను బదిలీ చేసింది. వీరు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కీలక బాధ్యతల్లో ఉంచొద్దని ఆదేశాలు జారీ చేసింది.

ముగ్గురు ఎమ్మెల్యేలపై సస్పెన్షన్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఒడిశా రాష్ట్రంలో రాజ్యసభ అభ్యర్థుల ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్ కాంగ్రెస్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. దీంతో తీవ్రంగా ఆగ్రహించిన అధిష్ఠానం ముగ్గురు ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ముగ్గురు ఎమ్మెల్యేలను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఏఐసీసీ ప్రకటించింది.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు గుడ్‌న్యూస్

అక్షరటుడే, అమరావతి: మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈనెల 31లోపు బకాయిలు చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం సబ్సిడీ ప్రకటించింది. ఇప్పటికే వడ్డీతో పన్ను చెల్లిస్తే తదుపరి బిల్లులో మినహాయింపు ఇస్తామని వెల్లడించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి జీవో జారీ చేశారు.

ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండా: లోకేశ్

అక్షరటుడే, ఏపీ: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి సమీపంలోని చినకాకానిలో మయూరి టెక్ పార్క్ భవనంలో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించిందని చెప్పారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని వివరించారు. ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలని మంత్రి సూచించారు.

పార్టీ మారాలనే ఆలోచనకు సంజయ్ కారణం

అక్షరటుడే, హైదరాబాద్ : తాను పార్టీ మారాలని ఆలోచించేందుకు ఎమ్మెల్యే సంజయ్ కారణం అని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి అన్నారు. తాను ఇంకా పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో తనది 40 ఏళ్ల బంధమన్నారు. ఎంత ఇబ్బంది ఉంటే పార్టీ మార్పుపై ఆలోచిస్తున్నానో అర్థం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్.. ప్రజల అభివృద్ధి హక్కును సాధిం చలేక పోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడితే.. ఫ్లెక్సీలు ఏంటీ.. అన్నీ మారతాయన్నారు.

తిరుమల శ్రీవారి జూన్ దర్శన కోటా షెడ్యూల్ విడుదల

అక్షరటుడే, తిరుమల : కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. శ్రీవారి భక్తులకు టీటీడీ కీలక న్యూస్ చెప్పింది. జూన్ నెలకు సంబంధించిన దర్శన కోటా షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ నెల శ్రీవారి ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్లు ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి 20న ఉదయం 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 21న ఆన్‌లైన్‌లో పెట్టనున్నారు. వర్చువల్ సేవలు, అనుబంధ దర్శనం టికెట్లను 21న మధ్యాహ్నం 3 గంటల నుంచి బుక్ చేసుకోవచ్చు.

భారీ చోరీ..

■ కూకట్‌పల్లిలో ఘటన ■ హవాలా డబ్బు తరలిస్తుండగా కాజేసిన దుండగులు ■ నిందితుల అరెస్ట్

నగరంలోని బహదూర్‌పురాకు చెందిన ఖుస్రూ, అజీముద్దీన్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై రూ.కోటి నగదు ఉన్న బాక్సుతో వెళ్తున్నారు. బైక్‌పై వెళ్తున్న వీరిని సోమవారం రాత్రి కూకట్‌పల్లిలో దుండగులు అడ్డగించారు. అనంతరం కళ్లలో కారం పొడి చల్లి ఆ నగదు బాక్స్‌తో ఉడాయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

కిందపడిపోగానే..

ఖుస్రూ, అజీముద్దీన్ కూకట్‌పల్లిలోని పిల్లర్ నంబర్ 825 వద్ద ఓ కారులో నుంచి నగదు ఉన్న బాక్సు తీసుకున్నారు. అనంతరం బైక్‌పై పెట్టుకొని బయలు దేరారు. పిల్లర్ నంబర్ 836 వద్ద వారిని రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు అడ్డగించారు. వారి కళ్లలో కారం చల్లారు. వారు కింద పడిపోగానే.. నిందితులు డబ్బులు ఉన్న బాక్స్‌ను తీసుకొని పారిపోయారు. అయితే డబ్బు తీసుకెళ్తున్నారనే పక్కా సమాచారంతో దుండగులు దారికాచి దోపిడీ చేశారు.

హవాలా డబ్బు..

డబ్బులు తీసుకొని వెళ్తున్న వారిని పోలీసులు విచారించారు. అంత డబ్బు ఎక్కడిది.. ఎక్కడకు తీసుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. హవాలా డబ్బు తీసుకెళ్తుండగా చోరీ జరిగినట్లు గుర్తించారు. రూ.10 నోటు చూపించి ఓ వ్యాపారి దగ్గర ఏజెంట్లు నగదు తీసుకున్నారు. ఆ డబ్బును జీడిమెట్లలో ఇవ్వడానికి వెళ్తుండగా చోరీ జరిగింది.

హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో భారీ చోరీ జరిగింది. బైక్‌పై వెళ్తున్న వారి కళ్లలో కారం కొట్టిన దుండగులు ఏకంగా రూ.కోటి నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. చోరీకి గురైన నగదు హవాల సొమ్ముగా గుర్తించారు. చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

శంషాబాద్‌లో అరెస్ట్..

కేసు నమోదు చేసిన పోలీసులు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. హవాలా సొమ్ము ఎక్కడిదనే కోణంలో మొదట విచారణ చేశారు. అనంతరం నిందితుల కోసం నగరం అంతా గాలించారు. ఈ క్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించారు. లక్నో ఫ్లైట్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను ఎయిర్‌పోర్ట్ సీఐఎస్ఎఫ్ సహకారంతో అరెస్ట్ చేశారు. కాగా.. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో హవాలా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

దుష్ప్రచారమే బీఆర్ఎస్ పని: సీతక్క

అక్షరటుడే, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో ఏం చేశారని నిలదీశారు. శాసనసభలో మాట్లాడుతూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు. మహిళా రుణాలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.1,390 కోట్ల వడ్డీలను చెల్లించామని వివరించారు. గతంలో రూ. 3వేల కోట్ల వడ్డీల భారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం వారిపై మోపిందని గుర్తు చేశారు. మా ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలి అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ : కేటీఆర్

అక్షరటుడే, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మూసీలో ముంచుతున్న ఇళ్లకు జీరో వాల్యూ కాదని, రేవంత్ రెడ్డి సీఎం అయి చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు, డిక్లరేషన్లకు, విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విలువ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలి సంతకం ఆరు గ్యారంటీల అమలు చేశామని 2023 గవర్నర్ ప్రసంగంలో ఉందన్నారు. కానీ ఏళ్లు గడిచినా ఆ హామీలు అమలు కావడం లేదన్నారు.

పైలట్ రోహిత్ రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ

అక్షరటుడే, హైదరాబాద్ : మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ, మాదకద్రవ్యాల వినియోగంపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి డ్రగ్స్ పార్టీ జరిగిన విషయం తెలిసిందే. ఈ పార్టీపై పోలీసులు దాడులు చేశారు. పోలీసుల దాడి సందర్భంగా ఓ వ్యక్తి కాల్పులు సైతం జరిపాడు. ఘటనా స్థలంలో పోలీసులు డ్రగ్స్‌తో పాటు గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి డ్రగ్స్ కేసులో దొరకడంతో పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో కేసీఆర్ చర్యలు చేపట్టారు. పార్టీకి నష్టం కలిగించే వ్యవహారాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అఫ్గానిస్థాన్‌పై పాక్ దాడి పిరికిపంద చర్య : భారత్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌పై పాకిస్థాన్ సోమవారం రాత్రి వైమానిక దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ దాడిని పిరికిపంద చర్యగా పేర్కొంది. రంజాన్ సమయంలో దాడులు దారుణమని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. దీనిని అఫ్గాన్ సార్వభౌమత్వంపై దాడిగా పరిగణిస్తున్నమని చెప్పింది. కాబూల్‌లోని ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన దాడిలో వందలాది మంది చనిపోయారు. ఈ దాడిలో సుమారు 400 మంది మరణించగా మరో 200 మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. సోమవారం రాత్రి స్థానిక కాలమానం ప్రకారం సుమారు 9 గంటల సమయంలో కాబూల్ నగరాన్ని భారీ పేలుళ్లు కుదిపేశాయని స్థానిక మీడియా తెలిపింది. పేలుళ్లతో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పుత్తడి బొమ్మలా రాశి ఖన్నా..

ఊహలు గుసగుసలాడే చిత్రంతో తెలుగు తెరపై మెరిసిన రాశి ఖన్నా.. ఆ తర్వాత జోరు, జిల్, శివ, బెంగాల్ టైగర్, సుప్రీం, హైపర్, జై లవకుశ , రాజా ది గ్రేట్ అంటూ పలు చిత్రాలతో ఆకట్టుకుంది. సింపుల్ స్మైల్‌తో మెస్మరైజ్ చేసే ఈ సొట్ట బుగ్గల సుందరి.. తాజాగా పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో ప్రేక్షకులను మాయ చేయడానికి సిద్ధమైంది. పవన్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో మరో హీరోయిన్ శ్రీ లీలతో పాటు ఈ ముద్దుగుమ్మ నటిస్తోంది. మార్చి 19న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఈవెంట్ శ్రీలీలతో పాటు రాశి ఖన్నా సందడి చేశారు. ముఖ్యంగా తన గ్లామర్ టచ్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తన ధరించిన లెహంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫొటోలను తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో ఈ అమ్మడు షేర్ చేసింది. ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

–అక్షరటుడే, సినిమాడెస్క్